క్లుప్తంగా

6న సన్నాహక సమావేశం

తుంగతుర్తి : నాగారంలోని ఆనంద్ గార్డెన్స్‌లో ఈ నెల 6న జరిగే నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ యాదవ్‌ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. సన్నాహక సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుండగాని రాములుగౌడ్, శ్రీనివాస్, రవికుమార్, వెంకన్న, ఉప్పుల నాగమల్లు, గోపగాని వెంకన్న, మురళి, సాయి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎండీ.పర్వీన్



తిరుమలగిరి : తుంగతుర్తి బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా తిరుమలగిరికి చెందిన న్యాయవాది ఎండీ.పర్వీన్ ఎన్నికయ్యారు. బుధవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం స్టేట్ స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా రాముయాదవ్

నాగారం : బీజేవైఎం రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన కన్నెబోయిన రాముయాదవ్ గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం రాముయాదవ్ మాట్లాడుతూ బీజేపీకి తాను అందిస్తున్న సేవలను గుర్తించి స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా నియమించిన పార్టీకి, తన ఎన్నికకు సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బుర నర్సయ్య గౌడ్, సంకినేని వెంకటేశ్వర్‌రావు, బొబ్బిలి భాగ్యారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

భానుపురి : ఇటీవల నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నూకల సుదర్శన్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ చేసిన అలుగుబెల్లి జగన్మోహన్‌రెడ్డిలను రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గోదాల రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చిలుముల సునీల్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, దేవి రెడ్డి రవీందర్ రెడ్డి, తుమ్మ రామచంద్రారెడ్డి, దండ వెంకట్ రెడ్డి, కట్కూరి చంద్రారెడ్డి, నూకల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో కళావేదిక నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న కళావేదిక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పూర్వవిద్యార్థి, దాత సహకారంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలలో శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామవాసి, 1965–66 హెచ్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, దాత బ్రాహ్మణపల్లి దశరథరామయ్యశర్మ స్వచ్ఛందంగా సుమారు రూ.4 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. తొలుత పాఠశాలలో కళావేదిక నిర్మాణం పనులు చేపట్టారు. ఈ వేదిక నిర్మాణం పూర్తికాగానే పిల్లలకు టాయిలెట్లను నిర్మించనున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తున్న పూర్వవిద్యార్థి దశరథ రామయ్యశర్మకు పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ బాలునాయక్ కృతజ్ఞతలు

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

పెన్‌పహాడ్ : నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు తరలించడం సరైంది కాదని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలను నింపి ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పాలేరుతోపాటు సూర్యాపేట జిల్లాలోని అన్ని గ్రామాలకు లిఫ్టుల ద్వారా నీటిని విడుదల చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని ఆయన కోరారు.

కల్లాలుగా రహదారులు!



అర్వపల్లి : పర్సాయపల్లి సమీపాన హైవేపై ఆరబోసిన ధాన్యం



అర్వపల్లి : సీతారాంపురం వద్ద..

అర్వపల్లి : యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. దీంతో పాటే రైతులకు కల్లాల కష్టాలు మొదలయ్యాయి. ధాన్యం ఆరబోతకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ పొలాల వద్ద కల్లాలను నిర్మించుకోవడానికి ప్రభుత్వం సాయమందించినా రైతుల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. ప్రస్తుతం రైతులు వరి పంటలు కోయగానే కల్లాల సమస్యతో ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో సూర్యాపేట–జనగామ 365బీ, నకిరేకల్–తానంచర్ల 365 రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. అయితే ఈ రహదారులపై అర్వపల్లి, పర్సాయపల్లి, వేల్పుచర్ల, జ్యోతులనగర్, తిమ్మాపురం, అడివెంల, సీతారాంపురం తదితర గ్రామాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున రైతులు ధాన్యం కుప్పలు పోసి ఉంచారు. కొన్ని చోట్ల రోడ్డు సగభాగంలో ధాన్యం ఆరబోశారు. దీంతో ఈ రహదారులపై ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం నెలకొంది. రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఆరబోయకుండా చూడాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.



అర్వపల్లి శివారులో..



అర్వపల్లి : వేల్పుచర్ల వద్ద..

తుక్కుగూడ సభను జయప్రదం చేయాలి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : ఈ నెల 6వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే తుక్కుగూడ జన జాతర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ కోరారు. గురువారం తిరుమలగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తుక్కుగూడలో జరిగే బహిరంగ సభకు తుంగతుర్తి నియోజకవర్గం నుంచి 20 వేల మంది హాజరవుతారని తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి భారీ ఆధిక్యంతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల 6న జరిగే కాంగ్రెస్‌పార్టీ జన జాతర సభను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తోందన్నారు. తుక్కుగూడ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతోపాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు గొలుసుల మహేష్, కొణతం రాజు, బాలరాజు, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

నూతనకల్ : ఈ నెల 6న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే జన జాతర సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే జన జాతర సభకు కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్ గాంధీలు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డుపల్లి అంజయ్య, ఇమ్మారెడ్డి రాజబహదూర్‌రెడ్డి, దరిపెల్లి వీరన్న, లింగాల రామచంద్రు, పసుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం వైద్యసిబ్బంది మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ టీకాలను వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, గోపాలమిత్రలు ఆల్దాస్ లింగయ్య, కుంభం సురేందర్, సూరారపు అర్జున్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

చివ్వెంల : ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం చివ్వెంల మండల పరిధి బీబీగూడెం గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల వేణారెడ్డి, ధరావత్ రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దిరాల : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం మద్దిరాల మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన నోముల గణేష్ తన ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో పోలీసులు ఆ ట్రాక్టర్‌ను పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీలకు సొంత భవనాలేవీ..

- అద్దె ఇళ్లు, పాఠశాలల్లో కొనసాగుతున్న కేంద్రాలు
- కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, లబ్ధిదారులు



మోదిన్‌పురం గ్రామంలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



లక్ష్మణ్ నాయక్ తండాలోని ప్రభుత్వ పాఠశాలలో..

చివ్వెంల : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ మెజార్టీ కేంద్రాలను సొంత భవనాలు లేకపోవడంతో అద్దె ఇళ్లలో, ఇరుకు గదుల మధ్య నిర్వహించాల్సి వస్తోంది.

20 కేంద్రాలకే సొంత భవనాలు..

చివ్వెంల మండల పరిధిలోని మూడు క్లస్టర్ల పరిధిలో 72 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 20 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా.. మరో 52 కేంద్రాలను ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని అదనపు తరగతి గదుల్లో, అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు. సాధారణంగా ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో వంటకు, పిల్లలు కూర్చునేందుకు, సామగ్రి నిల్వకు కనీసం మూడు గదులు ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా ఈ సౌకర్యం లేదు. పలు గ్రామాల్లోని కేంద్రాల్లో ఒక్క గది మాత్రమే ఉంటుందని సిబ్బంది వాపోతున్నారు.

తక్కువ అద్దెతో ఇబ్బందులు..

అద్దెభవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు నెలకు రూ.వెయ్యి వరకు చెల్లిస్తున్నారు. కానీ ఆ మొత్తం చాలకపోవడంతో తాము సొంతంగా చెల్లించాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. దీనికి తోడు సర్కారు నుంచి ప్రతి నెలా నిధులు విడుదల కాకపోవడంతో ఇంటి యజమానులతో మాటలు పడుతున్నామని పేర్కొంటున్నారు.

అన్ని సేవలు ఒకే చోట..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో పాటు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ సొంత భవనాలు లేకపోవడంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం, సామగ్రిని భద్ర పర్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కష్టతరంగా మారుతోందని అంగన్‌వాడీల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

సొంత భవనాలు అవసరమున్న అంగన్‌వాడీ కేంద్రాలకు గుర్తించి, నిధుల మంజూరు కోసం ప్రతి ఏటా ప్రతిపాదనలు పంపిస్తున్నాం. నిధులు మంజూరైతే సొంత భవనాలు నిర్మించవచ్చు. అద్దె భవనాల్లో ఉన్న ఒక్కో కేంద్రానికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెలవారి అద్దె రూ.వెయ్యి చెల్లిస్తున్నాం.

– శ్రీవాణి, సీడీపీఓ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అర్వపల్లి : బొల్లంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ, ఏపీఎం



అర్వపల్లి : కొమ్మాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం మల్లేష్



ఆత్మకూర్ (ఎస్) : పాతసూర్యాపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం



నూతనకల్ : వెంకెపల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెలుగు సిబ్బంది



మద్దిరాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

అర్వపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి ఆర్. శశిధర్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ కోరారు. గురువారం బొల్లంపల్లి, కొమ్మాల, కోడూరు గ్రామాల్లో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతం 17 శాతం లోపు ఉండేలా ఆరబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శోభారాణి, సీసీ పద్మ, సంఘ బంధం అధ్యక్షులు కె.మంజుల, ఎ. రజిత, రమణమ్మ, పంచాయతీ కార్యదర్శులు నారాయణమూర్తి, భద్రమ్మ, వీఓఏలు పద్మ, సరళ, యాదమ్మ, సంఘ బంధాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

ఆత్మకూర్(ఎస్) : రైతులు ఇబ్బందులు పడకుండా కేంద్రాల వద్ద సరైన వసతులు కల్పించాలని ఏపీఎం మంజుల అన్నారు. గురువారం మండల పరిధిలోని మంగళితండా, పాతసూర్యాపేట, ఏనుబాముల, గట్టికల్లు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దివ్య, సీసీలు చందూనాయక్, సుధాకర్, వీఓఏలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ సమ్మెట వెంకటయ్య, వెలుగు సీసీలు ముత్తయ్య, సర్వసతి కోరారు. గురువారం మండల పరిధిలోని చిల్పకుంట్ల పీఏసీఎస్, వెంకెపల్లి గ్రామాల్లో ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పీఏసీఎస్ సిబ్బంది ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు

- గ్రామాల్లో ప్రారంభమవుతున్న కొనుగోలు కేంద్రాలు



తిరుమలగిరిలో వరి కోస్తున్న హార్వెస్టర్

తిరుమలగిరి : యాసంగి సీజన్ వరి కోత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముందస్తుగా వరి నాట్లు వేసిన రైతులు గత పది రోజులుగా హార్వెస్టర్లతో వరి కోతలు చేపట్టారు. మరో వారం రోజుల్లో వరి కోతలు మరింతగా ఊపందుకునే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. తిరుమలగిరి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఆరు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో మరో ఆరు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో సైతం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

13,960 ఎకరాల్లో వరి సాగు..

తిరుమలగిరి మండలంలో యాసంగి సీజన్‌లో 13,960 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. గత పది రోజులుగా వ్యవసాయ మార్కెట్‌కు కూడా భారీగా ధాన్యం వస్తోంది. మరోవైపు వరి కోత మిషన్లకు గిరాకీ పెరిగింది. హార్వెస్టర్లకు ఎకరాకు రూ.2000 నుంచి రూ.2500 వరకు తీసుకుంటున్నారు.

తగ్గిన దిగుబడి..

ఈ యాసంగి సీజన్‌లో వరి పంటకు తెగుళ్లు సోకడంతో గతంలో కంటే దిగుబడులు తగ్గాయని రైతులు వాపోతున్నారు. గతంలో ఎకరాకు 50 బస్తాల దిగుబడి రాగా ఈసారి 30 నుంచి 35 బస్తాల దిగుబడే వచ్చిందని తెలుపుతున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

అర్వపల్లి : మండల పరిధిలోని గ్రామాల్లో హార్వెస్టర్ల కొరత ఏర్పడుతోంది. రైతులు హార్వెస్టర్ల కోసం తిరుగుతున్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో మొత్తం 19 ధాన్యం కేంద్రాలకుగాను ఇప్పటికే 16 కేంద్రాలను ప్రారంభించారు. మిగిలినవి కూడా రెండు మూడు రోజుల్లో ప్రారంభించడానికి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈసారి మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట సాగయింది. అయితే ఆలస్యంగా వరి నాట్లు వేసిన వరి పంటలకు గోదావరి జలాలు అందక ఎండిపోతున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం బియ్యం సరఫరా చేయాలి

నూతనకల్ : ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం సరఫరా చేయాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని బిక్కుమళ్లలో మమత బిన్ని రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో సరఫరా చేయాలని రైస్ మిల్లు యజమానికి సూచించారు. రైస్ మిల్లులోని బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, బిల్లు యజమాని రామసహాయం అనుప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్

‘పసునూరు’లో విషాదఛాయలు

నాగారం : సూర్యాపేటలోని అంజనాపురి కాలనీ వద్ద హైవేపై ఆటో–లారీ ఢీకొన్న ఘటనలో నాగారం మండల పరిధిలోని పసునూర్‌కు చెందిన గొలుసుల సంధ్య, గొలుసుల మోక్షిత్, గొలుసుల వేదాశ్విని(1) ఉన్నారు. ప్రమాదంలో వేదస్విని మృతి చెందగా సంధ్య, మోక్షిత్‌కు గాయాలయ్యాయి.

కుటుంబ నేపథ్యం..

గొలుసుల ఉప్పలయ్య, సంధ్యలు భార్యభర్తలు. ఉప్పలయ్య స్వగ్రామం పసునూర్ కాగా సంధ్య స్వగ్రామం అర్వపల్లి మండలంలోని కాసర్లపహాడ్. వీరు చౌటుప్పల్ వద్ద కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు. సంధ్యకు తన భర్త ఉప్పలయ్య ఇటీవల కాసర్లపహాడ్‌లో ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించాడు. అయితే సంధ్య గురువారం సూర్యాపేటలో కుట్లు ఇప్పించుకోవడానికి తన ఇద్దరు పిల్లలు, తల్లి కొమ్ము సువర్ణతో కలిసి ఆస్పత్రికి వెళ్లింది. వారు తిరిగి కాసర్లపహాడ్‌కు వెళ్తున్న క్రమంలో సూర్యాపేటలోని అంజనాపురి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్నారి వేదాశ్విని మృతి చెందగా.. సంధ్య, సువర్ణ, మోక్షిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పసునూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎరగాని గాంధీ (72) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్(78) అనారోగ్యంతో మృతి చెందాడు. వారి మృతదేహాలను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం కల్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, మండలపు శేషు, అమరనాయిని వెంకటేశ్వరరావు, ఎరగాని లక్ష్మయ్య, ఎండీ.రఫీ, కుక్కడపు సైదులు, నాగరాజు, రఫీ, నాయకులు, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని.. హైమాస్ట్ లైట్లు ధ్వంసం

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో ఓ ట్రాక్టర్ హైమాస్ట్ స్తంభానికి ఢీ కొనడంతో హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మైనర్ బాలుడు అతివేగంగా, నిర్లక్ష్యంతో ట్రాక్టర్ నడిపి వర్ధమానుకోటలోని ఓ హైమాస్ట్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో స్తంభం కూలి హైమాస్ట్ లైట్లు, పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



వర్ధమానుకోటలో విరిగిపడిన హైమాస్ట్ స్తంభం

లిఫ్టలకు విద్యుత్‌ను పునరుద్ధరించాలి

మునగాల : సాగర్ ఎడమ కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాలకు విద్యుత్‌ను నిలిపివేసి నిర్బంధంగా పోలీసుల పహారాలో సాగర్ నీటిని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు తరలించడం సబబు కాదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, జయభారత్ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొక్కిరేణి ఎత్తిపోతల పథకం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. సమావేశంలో లిఫ్ట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.